# బిగినర్స్‌లక్ మిథ్య

-కె. రామలక్ష్మి

జూదం మహా తప్పని తెలుసు. కాని దాని ఆకర్షణ మహత్తరం అయినది. 'ఒక్కసారి, ఒకే ఒక్కసారి – ఆడి చూద్దాం' అని దిగితే – అంతే. ఎక్కడో మనసులో ఒక మూల నక్కి – పీడిస్తూనే వుంటుంది. గెలుస్తామేమో అని.

'అట్లాంటిక్ సిటీ పిలుస్తోంది–' అంటూ వుంటుంది నా కూతురు. 'ఏముంది? రెండు గంటల డ్రయివింగు ఓ నాలుగైదు గంటలు సరదాగా గడిపేసి – దారిలో ఎక్కడో కాస్త తినేసి రాత్రి పడుకునే టైముకి ఇంట్లో వుంటాం – తెములు" అంటూ బయటికి వెళ్లక్కరలేని రోజు – నా ప్రాణాలు కొరికేస్తూ వుంటుంది. 'డబ్బు' శ్రీమహాలక్ష్మి. దాన్ని జాగ్రత్తగా వాడాలి. పూజించాలేగాని – ఇలా చెయ్యడం మహాపాపం" అని చాలా గట్టిగా చెప్పి చూశాను చాలాసార్లు. కాని అది చాలా మొండిది. వాదించి మనచేత– అది చేసే పని తప్పుకాదని ఒప్పించేస్తుంది!

ఈ మానసిక దౌర్బల్యానికి తోడు – రోజూ ఆ పోస్టు బాక్సులో – పెట్టే– కాగితాలు– వాటి ఆకర్షణలు ఇన్నీ అన్నీ కావు.

"అమ్మీ, చూశావా 'షో బోటే' వాడు పంపాడు రెండు రోజులు – ఫ్రీ రూం. ఆడడానికి ఇరవై డాలర్లు! లక్ష్మివారం శుక్రవారం. వుందాం. కాదనకు'' అని గట్టిగా హెచ్చరించింది కూడా.

నిజమే వాళ్లు వారంలో ఐదు రోజులు చచ్చేలాగా పనులు చేసుకుని వారాంతం అంత కంత శ్రమపడి హాయిగా గడుపుదాం అనుకుంటారు, ఇక్కడి వాళ్లు అక్కడికి, అక్కడి వాళ్లు ఇక్కడికి హడావిడిగా బయలుదేరేస్తారు – సరదా కోసం.

రోజూ పేపర్లో చదువుతున్నాను – అక్కడ పనిచేసే వాళ్లు చాలామంది వేతనాల పెంపు కోసం సమ్మె చేస్తున్నారని. పోలీసులూ హడావిడీ, కాసినోలలో పై వర్గం వాళ్లే – మేనేజర్లు – అసిస్టెంటు మేనేజర్లు, పనిచేయడానికి అభ్యంతరం లేని కొంతమంది సిబ్బందీ మాత్రమే – పనిచేస్తున్నారనీ కూడా తెలిసింది. "ఇక్కడదేం బాధలేదు. ఓవర్ టైము చేసేవాళ్లు సిద్ధంగానే వుంటారమ్మా. కొత్తవాళ్లని రానివ్వరంతే. నువ్వేం బెంగ పడి పోకు. గోల వుండదులే" అంటూ రడీ అంది.

చెప్పొద్దూ, నాకు గుండెల్లో గుబులుగానే వుంది. ఇక్కడ సమ్మె అంటే ఆ పక్కకి వెళ్లడానికి భయంగానే వుంటుంది. హఠాత్తుగా ఎప్పుడు ఎవరు రాయి విసురుతారో ఎక్కడ పోలీసులు లాఠీలు తిరగేస్తారో చెప్పలేం.

"వాళ్ల ఖర్చుతో మనం ఆనందించడానికెందుకింత భయం నా కర్థం కాదు–" అంటూ కారు బైటికి తీసింది అమ్మాయి. ఆ దేవుడి మీద భారం వేసి – ఇంకేం అనకుండా దాని పక్క సీట్లో కూర్చుని – బెల్టు తగుల్చుకున్నాను. వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వుంది. దారి పొడుగునా ఒక్క 'ఎవ్వర్ గ్రీన్స్' తప్పించి చెట్లన్నీ ఆకులు రంగులు మారుస్తున్నాయి. వాటి రంగులు చూస్తుంటే – నా కళ్లని – నేనే నమ్మలేనంతగా వుంది. ఎక్కడా ఎప్పుడూ కళ్లకి కనిపించని ఆకుపచ్చలో రకాలు పసుపులో రకాలు, కావి రంగులలో రకాలు పట్టుకుని – చిత్రీకరించిందా అన్నట్టుగా వుంది ప్రకృతి. టైము తెలియనేలేదు. కారుని 'షోబోటే'లోకి మళ్లించింది – 'వచ్చేశాం' అంటూ చిన్న పెట్టె పైకి తీస్తూ కారు తాళాలు వేవెకి అందించింది.

'సమ్మె అని పేపర్లు అంత గోల చేస్తున్నాయి – సందడే లేదేమిటే?' అన్నా చుట్టూ కలియచూస్తూ.

'ఇక్కడ అంతే నమ్మా. దేని దారి దానిది – చూడు – చుట్టూ – ఆ నోటీసులు. అవి సమ్మె చేస్తున్న వాళ్లు కాదు అంటిన్న. కాసినో వాళ్లు...' అప్పుడు చూశాను – 'క్షమించండి కొన్ని సేవలకి ఆటంకం వుంది' 'మాపై అభిమానం వుంచి – కొద్దిపాటి అసౌకర్యానికి – మన్నించండి. ఎంత త్వరలో వీలైతే – అంత త్వరలో – మీరు కోరుకునేవి సమకూరుస్తామని హామీ ఇస్తున్నాం' అంటూ చిన్న చిన్న కాగితాల మీద రాసిపెట్టారు. రిసెప్షన్ ముందే – క్యూలు చాంతాళ్లలాగా వున్నాయి.

"ఇదేమిటే?" అన్నాను క్యూలు చూసి.

"అన్నిరకాల 'తరగతులు' గదుల ఎలాట్‌మెంట్ కోసం. ఆడ్డానికి ఇస్తామన్న డాలర్ల కోసం" అంది – తనూ ఒక క్యూలోకి జొరబడుతూ.

నేను కాస్త దూరంలో కూర్చుని జనాలని పరిశీలనగా చూస్తున్నాను. అబ్బ! ఎంతమందో. వయసు మీరినవాళ్లు, నడవలేనివాళ్లు, వయసు వాళ్లు, తమ పెంపుడు కుక్కలని చంకన పెట్టుకుని వచ్చినవాళ్లు.. ఇక వాళ్ల బట్టల గురించి, వేసుకున్న నగల గురించి.. చెప్పక్కరలేదు. ఇవన్నీ సరిపోనట్టు పాతకాలపు పాదరసపు బుడ్ల రంగుల పూసల దండలు. అవి షోబోటు వాడి ధర్మం! 'రామ్మా... పంధొమ్మిదో ఫ్లోరు' అంటూ నా చేతిలో బాగూ, చిన్న సూట్‌కేసూ అందుకుంది నా కూతురు.

"ఇంత మందికి వాళ్లు అతిథి సత్కారాలు చేసి మరీ పిలుస్తూంటే – వాళ్లకేం లాభం వుంటుందే" అని అడిగా నమ్మలేక.

"వాళ్లలో చాలామంది పెద్ద మొత్తాలు ఆడేవాళ్లు వుంటారమ్మా. అలాంటి వారిని – కారు పంపించి మరీ పిలుస్తారు..." అంటూ లిఫ్టులకేసి నడిచింది. దాని వెనకే

నేనూ నడిచాను గాని - నా కళ్లు - ఆ అలంకరణల మీద - దేదీప్యమానంగా వెలిగిపోతున్న దీపగుచ్ఛాల మీద వున్నాయి. వాటి అందం చూడడానికి - రెండు కళ్లు చాలవు - అనుకున్నాను. లిఫ్టులో పంథొమ్మిదో అంతస్తుకి ఎక్కాం. రూము కాస్త లిఫ్టుకి దగ్గిరగానే వుంది. అక్కడ వందల మంది జనాన్ని చూశాను. గాని - యిక్కడ కారిడార్లలో - జనం కనిపించడమే లేదు. అంతా ఎటు మాయమయ్యారో.

"చాలా మంది కాసినోలోకి వెళ్లిపోయి వుంటారు. టైము దండగ చేయడం ఎందుకని" అంటూ నవ్వుతూ తలుపు తీసింది నా కూతురు.

రూము సువిశాలంగా వుంది. చక్కని చెట్లు. వాటి మీద అంత కంటే చక్కని పరుపులు, దుప్పట్లు. లేత వెలుగులు వెదజల్లుతూ - రెండు మంచాల మధ్య టేబిలు మీద లైటు.

"కావలిస్తే కర్టెన్సు తీయి - అవతల చాలా చక్కగా వుంటుంది - చూడడానికి" అంది పెట్టె తెరుస్తూ.

ఆ పక్క తెరల వెనుక పూర్తిగా గ్లాస్. కన్నుల పండువగా ఆకాశాన్ని నక్షత్రాలనీ వెక్కిరిస్తూంది - సిటీ. కళ్లు మిరుమిట్లు కొలుపుతున్నాయి దీపాలు. జనం కనబడడం లేదుగాని - పొడుగాటి బస్సులు వెడుతూ ప్రవహిస్తున్న వెలుగులాగా కన్పిస్తున్నాయి పైనుంచి.

"బస్సుల్లో కూడా వస్తున్నారే - ఇక్కడికి" అన్నాను.

"అవును. అసలు ఇక్కడి సీనియర్ సిటిజన్స్ వుండే హోమ్స్ నుండి రెగ్యులర్‌గా బస్సులు వస్తాయి. ఉదయం నుంచి సాయంత్రం దాకా కాలక్షేపం చేయవచ్చు. అంతేకాదమ్మా బస్సు టిక్కెట్టు ఫ్రీ. ప్లేయింగ్ మనీ ఇరవై వీళ్లే యిస్తారు" అంది - నవ్వుతూ. నేను బుగ్గలు నొక్కుకుంటే బాగుండదని చూస్తూ వూరుకున్నాను.

"మన వూళ్లలో ఏభయి దాటీ దాటకుండానే ఆడదాన్ని ముసలిది అనేస్తారు. వాళ్లకి సరదాలు వున్నా, కాస్త బాగా డ్రస్సయినా - వేళాకోళం చేస్తారు. అంతెందుకు! బస్సు కింద పడి వృద్ధ మహిళ మృతి అంటాయి పేపర్లు - తీరా చూస్తే ఆవిడకి ఏభయి వుంటాయి ఏళ్లు!... ఇక్కడి వాళ్లకీ మనవాళ్లకీ దృక్పథాలు చాలా వేరుగా వుంటాయమ్మా. ఇక్కడ వయసు మళ్లిన ఆడవాళ్లన్ని - ముసలి పీనుగలని పక్కకి నెట్టేయరు.. పోదామా.

"బట్టలు మార్చుకుంటావా?" అడిగింది. అప్పటికే సుఖంగా కూర్చుందుకు వీలుగా బట్టలు మార్చేసుకుంది!

నేను నా చీరకేసి చూసుకున్నాను. నలిపినా నలగని చీర. ఇక్కడికి వచ్చాక - ఇవే కట్టుకుంటున్నా! ఉతికినా ఆరేసుకుందుకు కుదరని నేత చీరలు కట్టి - పాపం పిల్లదాని పని ఎక్కువ చేయడం ఇష్టంలేక ఇవి కట్టుకోడం ప్రారంభించాను. జరీ చీరలు ఎక్కడేనా తెలుగు వాళ్ల యింటికి వెళ్లేప్పుడే ధైర్యంచేసి మడత విప్పుతున్నాను.

"అయితే పదమ్మా.. ఓ రెండు గంటలు ఆడి - ఏదైనా తిని వచ్చి పడుకుందాం. రూమ్ సర్వీసు లేదు - సమ్మెలో వున్నారు కదా సిబ్బంది'' అంటూ హాండ్ బాగ్ అందుకుంటున్న దాన్ని చూసి నా ప్రాణం పీకింది.

"అమ్మాయి. పొద్దుట ఆడుకుందాం" అన్నా నెమ్మదిగా.

"ఏం బద్ధకంగా వుందా?" అనునయంగా అడిగింది.

"అలా అని కాదే.." అంటూనే లేచాను - తినడానికేనా దిగాలి కదా అని.

కేసినోలో ఏదో మిషన్ దగ్గిర కూర్చుని ఆడడం కంటే - ఆడుతున్న వాళ్లని చూస్తూంటే - నాకు మతి పోయింది - వాళ్ల ఏకాగ్రత ఆశ్చర్యం కల్గిస్తుంది. సిగరెట్లు గొలుసుగా కాల్చేస్తూ, అటూ ఇటూ చూడకుండా ఐదూ పదీ పాతికా ఏభై సెంట్లు కాసులు పెట్టేవాళ్లు. ఇంత శ్రమ ఎందుకనుకుంటారో ఏమో కొందరైతే అచ్చివచ్చిన మిషనో ఏమో ఏకంగా ఇరవై ఏభై నూరు డాలరు నోటు పెట్టి - ఆటకి అంతరాయం కల్గకుండా ఆడేస్తున్నారు.

"చూశావా అమ్మా. ఇదివరకు నువ్వొచ్చినప్పుడైతే ఒకటే డబ్బు గలగలలు వినబడేవి కదూ. ఇప్పుడా బాధ లేదు. జబ్బ సత్తువ చూపి రాడ్ లాగవలసిన పనీ లేదు. బటన్ నొక్కడమే. చిల్లర ఏరుకో అక్కరలేకుండా రావలసిన దానికి బిల్లు బటన్ నొక్కవచ్చు" అంది - వచ్చిన మార్పుల గురించి చెప్తూ.

"డబ్బు చప్పుడు లేకపోతే ఏం బాగుంటుందే?" అన్నాను. ఆ చిల్లర, ఆ ప్లాస్టిక్ బొచ్చె - దాని మీద మనం వున్న కాసినో పేరు.. జ్ఞాపకం వచ్చి.

''ఆ నాణేలు తీస్తుంటే చేతి వేళ్లు నల్లగా తయారవుతున్నాయని చాలామంది అంటున్నారమ్మా. హాయిగా టికెట్ తీసుకుని మార్చుకోవడమే.." అంటూ కాస్త ఇటూ అటూ సిగరెట్లు కాల్చేవాళ్లు లేని - మిషన్ కోసం చూసి 'అమ్మా ఇక్కడ' అంటూ పిలిచింది. 'పది పెడతాను. మినిమమ్ ఐదు లైన్లు ఆడితే - కాస్త ఛాన్సు బాగుంటుంది' అంటూ కుర్చీ లాగి కూర్చోపెట్టి, 'నేనలా నాలుగు వరసలు చూసి ఎక్కడో కూర్చుంటా'నంటూ ముందుకి నడిచింది.

నడుస్తున్న నా ముద్దుల కూతురుకేసి చూస్తూ క్షణం పాటు అలాగే వుండిపోయాను. నేల మీద డబ్బులు పడితే తీసి కళ్లకి అద్దుకునేది - కింద పడేసినందుకు. డబ్బు దండగ ఖర్చుచేయడానికి అస్సలు ఇష్టపడేది కాదు... అలాంటి రెండు రోజుల కోసం 'ఒక్కొక్కళ్లకి రెండొందలు' అని కాసినోలో ఆడడానికి డబ్బులు తీస్తున్న దాన్ని చూసి - ఆశ్చర్యం కల్గింది. పిసినారి కాకపోయినా - జాగ్రత్తయిన పిల్ల - ఇలా ఎలా తయారైంది - పేకాడ్డం, జూదం ఆడ్డం - పాడుపనులని నమ్మే నన్ను కూడా మార్చేసింది - ఇదెలా సాధ్యం అయింది - నా కర్థం కాలేదు.

మిషన్ ముందు కూర్చున్నానే కాని - బుర్ర దానిమీద

లేదు. చిన్నప్పుడు పెద్దలాడుతున్న పేకముక్కలు తాకితే అమ్మ వేళ్ల మీద కొట్టేది. దీపాలు పెట్టేవేళ గవ్వలాడితే - కొట్టేది - అరిష్టం అని. ఎన్నో ఎన్నెన్ని ఆంక్షల మధ్య పెరిగి పెద్దయిన నాకూ పెళ్లీ పిల్లలూ వాళ్ల పెళ్లిళ్లూ అన్నీ జరిగాయి. నా నమ్మకాలు సిల్లీ అనీ, మూర్ఖం అనీ భర్తా పిల్లలూ కూడా నవ్వేవారు, నన్ను ఆటపట్టించేవారు. 'చూద్దాం మా అమ్మ మాట - నిజం అవుతుందో లేదో అని కావాలని మునిమాపువేళ పేకాడి చూపించేవారు... ఇప్పుడు.. నేను స్వయంగా కట్టుదిట్టంగా పెంచిన పిల్ల - హాయిగా సరదాగా- రిలాక్సు కావడానికి జూదానికి వస్తుంది. అక్కడ - అంతా డబ్బు - డబ్బు మయం. పోగొట్టుకునేవాళ్లు ఎక్కువ మంది. "అలాగ కాకపోతే కేసినోకి - లాభాలెలా వస్తాయి. అందరూ గెలిచేవాళ్లే అయితే - సరదా ఏముంటుందమ్మా. చూడు ఎవడేనా పెద్ద మొత్తం గెలిస్తే ఆ గోల. ఆర్భాటం. అసలు సైలెంటుగా సాగే చోట - లక్షలు చేతులు మారినా - నిశ్శబ్దం తాండవిస్తుంది. బ్లాక్ జాక్ టేబిల్సు చూడు - ఏదో కొంపలంటుకున్నట్టు సీరియస్‌గా వుంటారు. నీ దగ్గిర డబ్బు లేకపోతే - 'జాయింట్‌గా ఆడుదాం' అంటూ పెట్టుబడి పెట్టేవాళ్లు కూడా ఆ టేబిల్ దగ్గిరే వుంటారమ్మా. ఇక్కడ నువ్వు దేన్ని చూసీ, వినీ ఆశ్చర్యపడక్కరలేదు' అంటూ ఆడకుండా చుట్టూ కలియచూస్తున్న నా భుజం మీద చెయ్యి వేసింది - "ఎప్పుడొచ్చావే అయిపోయిందా?" అన్నాను కాస్త ఉలిక్కిపడి.

"వంద పోయిందమ్మా - పూర్తిగా పది నిముషాలు కూడా అవలేదు" అంది గలగల నవ్వేస్తూ.

"అరె. ఇంకా నువ్వు ప్రారంభించలేదా - కానివ్వు. ఇక పోయి తిని వద్దాం" అంది పక్కగా ఓ కుర్చీ లాక్కుని కూర్చుంటూ.

"పెట్టిన డబ్బు ఆడితేనే కదమ్మా - వస్తుందో పోతుందో తేలేది" అంది.

నేను రాడ్ లాగే శ్రమ లేకుండా బటన్ నొక్కింది. క్షణాల మీద - డబ్బు ఖాళీ అయింది. ఆడిన సరదా తీరలేదు. మళ్లీ ఇంకో నోటు తీస్తున్న అమ్మాయిని ఆపి "చాల్లేవే" అన్నా.

"ఎలా. కాస్తేనా గెలవాలి కదా" అంటూ పెట్టేసింది- 'గుడ్ చూడు లైనుకి ఏభయి - వచ్చింది. గుడ్" అంటూ మళ్లీ ఆడింది. పెట్టిన దానికి పదిరెట్లు.

"చాల్లే డబ్బు తీసుకో" అన్నాను.

"ఇంకొక్కసారి. బిగినర్‌వి కదా. లక్. ఈసారి చూడు" అంతే.. వరసగా- వచ్చినదీ, పోయినదీ కలిసిపోయింది.

'పద' అంటూ లేచాను - ఇద్దరం షోబోటు నుంచి అడ్డంపడి నడిచి - ట్రంప్ గారి కేసినోలో పడ్డాం.. అక్కడే ఇంకా ఓ కాంటీన్ నడుస్తోంది. అన్నిచోట్లా సమ్మె మూలాన

## నానీలు

వ్యసనం లేనివాడు
వ్యర్థ జీవియట
ఆహా!
ఏమి క్రొత్త సిద్ధాంతం!

విశ్వమంతా
మనకు చేరువలో
అనుబంధాలు మాత్రం
మీదికి దూరంగా!

గొడ్డలి వేటుకు
విలపిస్తుంది చెట్టు
మనసు
ముక్క చెక్కలైంది!

హత్యలకు
పకడ్బందీ వ్యూహం
నేడే చూడండి
ధారావాహికలు!

ఉక్కు కౌగిలికి
ఆహ్వానం పలుకుతూ
ప్రపంచీకరణ
బహుపరాక్!

అతివృష్టి
అనావృష్టి
రైతు బ్రతుకు మీద
ప్రకృతి అల్పదృష్టి

కష్టజీవి స్వేదం
ఆవిరైనా
వర్షిస్తున్నది
కరువుల కన్నీటినే!

ఉప్పెనగా
ఊరిని కబళించింది
నీటికి ఇంత ఆకలా!

వాయిదా పద్ధతి 'లోను'
అప్పుల ఊబి 'లోను'
మునిగారు
మధ్య తరగతి!

-పి. లక్ష్మణ్‌రావు

మూసేశారు.. కాస్త పళ్లరసం, బ్రెడ్ గట్రా తిని - బయటపడ్డాం. 'కాస్త ఊరు చూసి రూంకి చేరదాం' అంది - కారుని చాకచక్యంగా ట్రాఫిక్‌లోకి ప్రవేశపెడుతూ.

ఎటుచూసినా - వడ్డీ వ్యాపారులే. 'తాకట్టు పెట్టండి. విడిపించుకొండి' అంటూ ఆహ్వానాలు.

"డబ్బు పోగొట్టుకోవడమే కాక - ఇదొకటా?" అన్నా.

"మరి? చేతిలో వున్నదయిపోతే - డబ్బు లేదనుకోవడం ఎలా! క్రెడిట్ కార్డులు వుండవా! నగా నట్రా వుండదా. ఇక్కడ అప్పు పుట్టదా. అన్నీ - వుంటాయి. ఒక్కసారి ఓడి భయపడి ఎవరమ్మా పారిపోతారు! ఎక్కడో మనలాంటి వాళ్లు గాని. మనకి ఎక్కడ లేని జబ్బు - కూడబెట్టడమే గాని అనుభవించడం - నేర్పరు. అవునా?"

"వానాకాలానికి కాస్త ఆధారం వుండాలి కదే"

"సరే, తినడానికి, బ్రతకడానికి - భవిష్యత్తుకి - తరువాత! అమ్మా, ఈ క్షణం కోసం - ఈ వర్తమానం హాయిగా గడపడం కోసం కూడా బ్రతకాలి కదా. లేకపోతే - మనం కూడా మిషన్లుగా మారిపోతాం" అంది - గొప్ప వేదాంతిలాగా.

నాకు ఏం అనాలో తోచలేదు. 'దీని మాటల్లో కూడా నిజం కాస్త వుందా ఏమిటి?' అన్న అనుమానం తలెత్తిందా క్షణంలో-

'ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు! డాలర్లు పోయాయనా, గెలవలేదనా. డబ్బు పెట్టడం గెలవడానికి - పెట్టుబడి అనుకో - ఓడిపోతే - పోయిందనుకో. వస్తే - సరేసరి మళ్లీ ఆడవచ్చు' అంటూ మళ్లీ కారుని పార్కింగ్ లాట్‌లోకి మళ్లించింది.

నాకు బుర్ర పనిచేయడం మానేసింది. రూంలో - కిటికీ దగ్గర నిలబడి దూరంలో తెగ విరుచుకుపడుతున్న సముద్రాన్ని చూస్తున్నాను. దాని అలజడి కనిపిస్తోంది తప్ప దాని ఘోష వినబడంలేదా అద్దంలోంచి!

నీటి కాకులు - గుంపులు గుంపులుగా ఎగిరి అటూ ఇటూ తిరుగుతూ - వాలడానికి వీలైన స్థలం కోసం చూస్తున్నాయి - క్షణం గాలిలో వేలాడుతున్నట్టు వూగిసలాడి - మళ్లీ రెక్కలు విప్పి ఎగురుతున్నాయి.

"వీటికీ కేసినో వేదాంతం బాగా వంటపట్టినట్టు వుంది - వాల చోటులేకపోయినా - ప్రయత్నం - ఆపడంలేదు" అన్నా కాస్త నవ్వుతూ.

"అంతే ఆ దీపాల వరసలు చూడు - వాటి డోములకి వీటి రెక్కల రంగే వేశారు! అదీ - తెలివి అంటే' అంది నా కూతురు.

ఉదయం అవుతూనే - కిటికీ దగ్గరకు చేరాను. ప్రకృతి చూద్దామని. ఈ పక్క వరసగా కార్లు - ఆపుకొని సమ్మెకారులు సమ్మె చేయడానికి నిర్దేశించిన స్థలంలోకి ఒక్కొక్కరుగా చేరుతున్నారు. వారి చేతుల్లో నినాదాల ప్లకార్డులు. చూస్తుండగా వందా రెండు వందల మంది చేరిపోయారు. నినాదాలు వినిపించడం లేదు. పోలీసు బలగాలు మోహరించలేదు. అంతా పద్ధతిగా సాగిపోతోంది - "అదేమిటే!" అని ఆశ్చర్యపడ్డాను.

"అది అంతేనమ్మా. ఇది కాపిటలిస్టు రాజ్యంలో జరుగుతున్న సమ్మె. రాళ్లు విసరడాలూ, దారిలో అందరికీ ఇబ్బంది కల్గించడాలు - ఒప్పుకోరు - ఇలా ఆఫీసు కొచ్చినట్టే వచ్చి - నిరసన తెలిపి లంచ్ టైముకి లంచ్ చేసి - అంతా రొటీన్ - ఒక్క పనిలోకి వెళ్లడం తప్పించి" నవ్వుతూ చెప్పింది నా కూతురు. "ఈ పద్ధతి బాగుంది" అనిపించింది నాకు - గోల లేదు - అయినా సమ్మె జరుగుతోంది.

మళ్లీ కేసినోలో - ఇద్దరం కలిసి పోగొట్టుకున్నాం. బయలుదేరు ముందు - పోనీ ఈ ఇరవై ఆడు - "బిగినర్స్ లక్" అందో మిషను దగ్గర ఆగి.

నాకూ అనిపించింది - 'పోయినచోటే వెతుక్కో'మని కదా సూక్తి. అనుకుంటూ కూర్చున్నాను కాని కూర్చున్న పది నిమిషాల్లో ఖాళీ. 'లే' అంటూ బయలుదేరాను.

"నీకు ఇదో తప్పు పని అని నమ్మకం. అందుకే నువ్వు గెలవలేదు" అంది కాస్త నిష్ఠూరంగా. 'కాదే ఈ సారి ఏమో గెలుస్తానేమో అనే ఆడానే అమ్మాయి' అన్నా.

"అంటే నీకు ఈ బిగినర్స్ లక్" కూడా లేదన్నమాట" అంటూ కారు స్టార్ట్ చేసింది.

## కవితోపదేశం

ఒక్కో సంఘటన
ఒక్కో దృశ్యం
ఆలోచనను రేకెత్తిస్తుంది
ఊహించకుండానే
కవితా మాలికలను
కలం వ్రాసుకుపోతుంది
మాధుర్యంగా మహోన్నతమై
అలరారుతుంది
కావాలని రాత మొదలుపెడితే
అందక మొండికేస్తుంది
ఎందుకా అవస్థ అని
బుద్ధి చెబుతుంది
రావాలనుకున్నప్పుడు
నేనే వస్తాను గదాని
ఊరడిస్తుంది

-సిరి